క్లుప్తంగా

నేడు లక్ష పుష్పార్చన

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పూనగంటి ఓంప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు చంద్రమౌళీశ్వర ఆరాధన, తదుపరి 7 నుంచి 8 గంటల వరకు 102 జంటలతో వాసవి అమ్మవారికి గురువుల ఆధ్వర్యంలో పుష్పార్చన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సిమెంటు గోడౌన్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం: పక్కా గృహాల నిర్మాణాలకు సంబంధించి మండల కేంద్రంలో నిల్వ ఉంచిన సిమెంటు గోడౌన్‌ను శుక్రవారం హౌసింగ్ డీఈఈ రమనయ్య తనిఖీ చేశారు. మండలంలో ఎంత మందికి ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరయ్యాయి, ఇప్పటి వరకు ఎంత మంది లబ్ధిదారులకు ఎన్ని బస్తాల సిమెంటు అందజేసారు, నిల్వ ఉన్న బస్తాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ పనుల వేగవంతానికి ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన

బి.కొత్తకోట: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్యురాలు దుర్గాదేవి అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. నోటి ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, వాటి సమస్యలపై వైద్య వివరాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ జె.కిరణ్ కుమార్, డాక్టర్ ఆరీఫుల్లా, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రెడ్డి కమ్యూనిటీ విభాగం అధ్యక్షుడి నియామకం

కురబలకోట: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) అన్నమయ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా అనిపిరెడ్డి కులదీప్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్ర పురెడ్డి సురేంద్ర రెడ్డి నియామకం పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కులదీప్ రెడ్డి మాట్లాడుతూ వివిధ రెడ్డి సామాజిక వర్గ సమస్యల పరిష్కారం కొరకు నిస్వార్థ సేవలు అందిస్తానని తెలిపారు. అలాగే రెడ్ల చైతన్యం కోసం పాటుపడతానని తెలిపారు.

రెడ్డిరాజు మృతికి నివాళి

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ మచ్చువారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డిరాజు మృతి ఎంతో బాధాకరమని మదనపల్లెనియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మచ్చువారిపల్లెకి వెళ్లి రెడ్డిరాజు మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

మదనపల్లె: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శుక్రవారం బాధితుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని తట్టివారిపల్లె, దేవతానగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. వారి క్షేమసమాచారాలు తెలుసుకుని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మంజూరైన ఆర్థిక సహాయంకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందుల్లో ఉన్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు షంషీర్, నాదెళ్ల శివన్న, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

మదనపల్లె: కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను కాపాడుకుంటామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, ఎమ్మెల్యే షాజహాన్ బాషా కుమారుడు జునైద్ అక్బరితో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి,పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజంపేట పార్లమెంట్ ఐ టీడీపీ ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకటేష్‌ను పరామర్శించారు. ఆత్మహత్యయత్నం విషయం తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ స్పందించి, ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరినట్లు తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు.

ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాబు జగజ్జీవన్ రామ్ 118వ జయంతిని ముందస్తుగా నిర్వహించారు. శుక్రవారం జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నటరాజన్ మాట్లాడుతూ భారత స్వాంత్ర్య ఉద్యమంలో జగజ్జీవన్‌రామ్ స్ఫూర్తిదాయ పాత్ర పోషించారని కొనియాడారు.

దోమల నివారణపై అవగాహన

గుర్రంకొండ: దోమల నివారణతోనే జ్వరాలను అదుపు చేయవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి మహమ్మద్ రఫీ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ముజీబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తరిగొండలో దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు.

దాసుడి భక్తికి పరవశించిన శ్రీరాముడు



ముత్యపు పందిరి వాహనంలో విహరిస్తున్న శ్రీసీతారామలక్ష్మణులు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

- ముత్యపు పందిరిలో సీతారామలక్ష్మణులు
- వైభవంగా స్నపన తిరుమంజనం

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం శ్రీపట్టాభి రాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం తనదాసుడైన హనుమంతుడి వాహనంపై పట్టణపురవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశాడు. తెల్లవారిజాము నుండి సుప్రభాతసేవ, అభిషేకం, అర్చన విశేష పూజలు జరిగాయి. ఉత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులను విశేషంగా అలంకరణలు చేసి ముత్యపు పందిరి వాహనంలో తిరుమాడవీధుల్లో భక్తజనం మధ్య ఊరేగించారు. పుర వీధులలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు కొబ్బరకాయలు సమర్పించి, కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వాహన సేవ అనంతరం సేదతీరిన సీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల సందడి నడుమ శ్రీరామ వత్రమాల భక్తులు వెంటరాగా హనుమంత వాహన సేవతో భక్తులు తన్మయం చెందారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలతో స్వాములవారి ప్రతిమలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి:

సీతారామలక్ష్మణ చల్లని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు హాజరైన ఆయన సీతారాములవారిని దర్శించుని మొక్కులు తీర్చుకున్నారు. పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వక్ఫ్ చట్ట సవరణను నిరసిద్దాం

- రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం
- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : లౌకిక విలువలు, మైనారిటీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణలపై అన్ని వర్గాల ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానికంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ మైనారిటీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణలను నిరసించండి, వక్ఫ్ చట్ట సవరణను నిరసిద్దాం - రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం అంటూ సీపీఎం ముద్రించిన కరపత్రాలు విస్తృతంగా పంపిణీ చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందూత్వ మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందన్నారు. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. బిల్లుపై టీడీపీ జనసేనల వైఖరి లౌకికత్వానికి విఘాతం కలిగించాయన్నారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదనే సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా, భారత రాజ్యాంగంలోని 25, 29, 30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా రూపొందించారన్నారు . భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా చేయబడిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించాలన్నారు.

ఎన్‌సీసీతో ఉత్తమ జీవితం



మిట్స్ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్‌జె ఆత్రే

కురబలకోట: పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులకు చదువు ఒక్కటే సరిపోదు..ఎన్‌సీసీ లాంటివి ఉంటే ఉత్తమ భవిష్యత్తుతో పాటు మెరుగైన జీవితం సాగించడానికి ఆస్కారం ఉంటుందని గ్రూప్ కెప్టెన్ తిరుపతి కమాండింగ్ ఆఫీసర్ ఆర్‌జె ఆత్రే అన్నారు. శుక్రవారం ఆయన అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ వింగ్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ఉపాధి, ఉద్యోగాలకుఊతంగా నిలుస్తుందన్నారు. ఏ,బి,సి సర్టిఫికెట్లు ఉన్నత విద్య, ఉద్యోగాలకు ఉపయోగపడతాయన్నారు. అంతేగాకుండా ఎంసెట్, ఈసెట్, పాలిటెక్నిక్, డిప్లొమా తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కౌన్సిలింగ్‌లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉన్న వారికి ప్రత్యేక కేటగిరిగా పరిగణించి సీట్లు కేటాయిస్తారన్నారు. సి సర్టిఫికెట్ కలిగిన వారికి ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆర్మీ తదితర రక్షణ రంగాల్లో అవకాశం కల్పిస్తారన్నారు. పోలీస్ నియామకాల్లో అదనంగా మార్కులు కేటాయిస్తారన్నారు. వివిధ ప్రైవేటు,ప్రభుత్వ సంస్థలు, నిఘా, భద్రత, సెక్యూరిటీ ఉద్యోగాల్లో వీరికి ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫాం ఉన్న దళం ఎన్‌సీసీదేనన్నారు. క్రమ శిక్షణ, సేవా భావం, దేశ భక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఎన్‌సీసీలో చేరి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలని కోరారు. మాస్టర్ వారెంట్ ఆఫీసర్ ఎల్. సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ యువరాజ్, లెఫ్టనెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ స్ప్రేయర్లు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

పీలేరు : రైతులకు 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న పవర్ స్ప్రేయర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీలేరు, కేవీపల్లె, కలకడ, మండల రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రైతులకు సబ్సిడీతో పవర్ స్ప్రేయర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ రైతులకు విశిష్ట సంఖ్య గురించి అవగాహన కల్పించి ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ చేపించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏవో రమేష్‌రాజు, టెక్నికల్ ఏవో కరుణాకర్‌రెడ్డి ఏవోలు శ్రావణి, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ అమరసింహరాజు

కలికిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్, గైనకాలజిస్ట్ ఆశాలత ఆధ్వర్యంలో గర్భిణులకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలలోనే సురక్షితమైన ప్రసవాలు సాధ్యమవుతాయన్నారు.గర్భిణులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

సహజ ప్రసవం శ్రేయస్కరం

తంబళ్లపల్లె: గర్భిణులకు సహజ ప్రసవం శ్రేయస్కరమని డాక్టర్ అమరసింహరాజు తెలిపారు. శుక్రవారం సీహెచ్‌సీలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ జరిగితే త్వరగా కోలుకొని మరుసటి రోజే ఇంటికి వెళ్లవచ్చునన్నారు. అదే సిజేరియన్ జరిగితే పదిరోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సిరావడమే కాక కోలుకోవడం కూడా ఎక్కువ రోజులు పడుతుందన్నారు. గర్భిణులు, వారి కుటుంబసభ్యులు తొందరపడకుండా నార్మల్ డెలివరీకి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

నవమి ఉత్సవాలకు సిద్ధం



కళ్యాణానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ: మదనపల్లెలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. రామాలయాలతో పాటు ఆంజనేయస్వామి ఆలయాలు ఉత్సవాలకు సిద్ధం చేశారు. స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో శనివారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక వాహనాల్లో స్వామిని ఊరేగింపు నిర్వహిస్తారు. స్థానిక బీటీ కాలేజీ మైదానంవద్దనున్న వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆదివారం శ్రీరామనవమి రోజున సాయంత్రం కళ్యాణం నిర్వహిస్తారు. స్థానిక అప్పారావువీధిలోని ఘటికాచల ఆంజనేయస్వామి ఆలయం,మేదరవీధిలోని పిండాల ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. సీరుగట్టువారిపల్లెలోని పాత ఊరులో రామాలయం, బసినికొండలోని రామాలయం, సీటీఎంలోని ఆంజనేయస్వామి ఆలయం, కొత్తపేటలోని రామాలయాల్లో నవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

అద్దె భవనాలకు దరఖాస్తులు ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లాలోని కలకడ, గుర్రంకొండలో ఉన్న ఏపీ గురుకుల బాలికల పాఠశాలల నిర్వహణకు అద్దె భవనాలకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ వేర్వేరుగా శుక్రవారం ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో వసతులు సరిగ్గా లేని కారణంగా ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి ఆదేశాల మేరకు 480 మంది విద్యార్థులకు సరిపడేలా ఉన్న భవనాలను వెతికి అక్కడికి మార్చుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ఆ ప్రాంత పరిసరాలలో విద్యార్థినులకు సరిపడే విధంగా 10 తరగతి గదులు, 10 వసతి గదులు, 15 స్నానపు గదులు, 15 టాయిలెట్లు, ఒక వంట గది, నీటి సౌకర్యం ఉన్న 15,000 - 20,000 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన భవనం అద్దెకు కావాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 87126 25054(గుర్రంకొండ), 87126 25055(కలకడ)లను సంప్రదించాలని వారు సూచించారు.

నియామకం



బాలాజి నాయక్

కేవీపల్లె : ఆల్ ఇండియా ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పెద్దతాండాకు చెందిన బాలాజి నాయక్‌ను నియమిస్తూఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ శారద నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలాజి నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



తంబళ్లపల్లె: మండలంలోని పరసతోపు పంచాయతీ బురుజులో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం తొగటవీరక్షత్రియులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కృష్ణమూర్తి అమ్మవారికి అలంకరణలో పూజలు,అభిషేకాలు చేశారు. మహిళలు నియమనిష్టలతో అమ్మవారికి దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడిపంటలతో ప్రజలు ఆయుఆరోగ్యాలతో కళకళాడే విధంగా దీవించాలని మొక్కుకున్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న రాజేష్

మదనపల్లె: ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని రోగులకు శుక్రవారం పండ్లు బ్రెడ్డు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన రాజేష్ పుట్టిన రోజు సందర్భంగా తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆసుపత్రికి చేరుకుని వివిధ వార్డులలో ఉన్న రోగులకు వారి చేతుల మీదుగా పండ్లు బ్రెడ్డు అందజేశారు. పుట్టినరోజున సేవ కార్యక్రమం చేయాలన్న ఉద్దేశంతో రోగులకు తన వంతు సాయం చేసినట్లు తెలిపారు. తరచూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

న్యాయవాదిపై దాడి హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తంబళ్లపల్లె: అమరావతి హైకోర్టు న్యాయవాది కోటిపల్లి అయ్యప్పపై దాడి హేయమైన చర్యని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమల్‌రెడ్డి, కార్యదర్శి గఫార్ ఖండించారు. ఇందుకు శుక్రవారం కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సోమవారం కూడా న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీ అధ్యక్షుల నియామకం

మదనపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన పలు మండలాలకు అనుబంధ విభాగాలీ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

మదనపల్లె అనుబంధ విభాగాల అధ్యక్షులు..

యూత్ వింగ్ టి.హరికృష్ణారెడ్డి, మహిళా విభాగం వైజయంతి, రైతు విభాగం ఎం.విశ్వనాథరెడ్డి, బీసీ సెల్ బి.గంగులనాయుడు, ఎస్సీసెల్ కె.వెంకటరమణ, ఎస్టీ సెల్ బి.హరికృష్ణ నాయక్, మైనార్టీ సెల్ మస్తాన్ సొహైల్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ జీఎస్ మధుకుమార్, విద్యార్థి విభాగం వేణుగోపాల్‌రెడ్డి, పంచాయితీ రాజ్ విభాగం ఎం.రామచంద్ర, ఆర్టీఐ విభాగం ఎస్.మల్లికార్జునరెడ్డి, వలంటీర్స్ విభాగం లక్ష్మి రమణ,, చేనేత విభాగం ఎం.రెడ్డిశేఖర్, వాణిజ్య విభాగం సి.రవణప్ప, వైఎస్సార్‌టీయూసీ ఎన్.సాంబశివారెడ్డి, అంగన్వాడీ విభాగం రత్నమ్మ, సాంస్కృతిక విభాగం కదిరిపతి , సోషల్ మీడియా విభాగం పఠాన్ జాఫర్ అలీ, ప్రచారం విభాగం అధ్యక్షుడిగా పి. అనిల్ కుమార్‌లను నియమించారు.

మదనపల్లె మున్సిపల్ అనుబంధ విభాగాల అధ్యక్షులు..

యూత్ వింగ్ ఇ.విష్ణువర్ధన్‌చౌదరి, మహిళా విభాగం ఏవీ అపర్ణ, బీసీ సెల్ విశ్వనాథ్, ఎస్సీసెల్ కె.తిలక్, ఎస్టీ సెల్ ప్రభాకర్‌నాయక్, మైనార్టీ సెల్ షేక్ జావీద్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ ఆర్.రాజేష్ బాబు, విద్యార్థి విభాగం ఎస్.అర్షద్, మున్సిపల్ విభాగం ఎండీ ముజీబుద్దీన్, ఆర్టీఐ విభాగం ఎం .దుర్గం చరణ్, వలంటీర్స్ విభాగం కె.సుదర్శన్‌రెడ్డి, వాణిజ్య విభాగం సయ్యద్ తాజ్‌బాష, వైఎస్సార్‌టీయూసీ పి.ముబారక్, అంగన్వాడీ విభాగం ఎం .రోజా, సాంస్కృతిక విభాగం పి.లక్ష్మీదేవి, సోషల్ మీడియా విభాగం వి.శ్రీకాంత్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం టి.నియాజ్ అలీ, ప్రచారం విభాగం అధ్యక్షుడిగా సాయిశేఖర్‌రెడ్డిలను నియమించారు.

నిమ్మనపల్లె మండలం ..

యూత్ వింగ్ ఎం.యోగానందరెడ్డి, మహిళా విభాగం ఎస్.రమ్య, రైతు విభాగం ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ పి.రమష్, ఎస్సీసెల్ ఎస్.వీరయ్య, ఎస్టీ సెల్ టి.నరసింహులు, మైనార్టీ సెల్ ఎస్.మహమ్మద్ రఫీ, క్రిష్టియన్ మైనార్టీ సెల్ జయకుమార్, విద్యార్థి విభాగం కె.ప్రశాంత్, పంచాయితీ రాజ్ విభాగం టి.ఆదినారాయణ, ఆర్టీఐ విభాగం కె.దామోదర్, వలంటీర్స్ విభాగం కె.చంద్రశేఖర్, చేనేత విభాగం బి.గిరి, వాణిజ్య విభాగం టి.కదిరప్ప, వైఎస్సార్‌టీయూసీ దావూద్‌ఖాన్, అంగన్వాడీ విభాగం ఎస్.గుండ్లూరు రఖియాబేగం, సాంస్కృతిక విభాగం జి.శ్రీనివాసులు, సోషల్ మీడియా విభాగం టి.రవితేజ, దివ్యాంగుల విభాగం శ్రీనివాసులు, ప్రచారం విభాగం అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డిలను నియమించారు.

రామసముద్రం మండలం..

యూత్ వింగ్ టి.బాలాజీ, మహిళా విభాగం పి.అంజమ్మ, రైతు విభాగం బి.ఈశ్వర్‌రెడ్డి, బీసీ సెల్ రెడ్డివీర గౌడ్ ఎస్సీ సెల్ ఎన్.శివ, ఎస్టీ సెల్ వై.రామకృష్ణ, మైనార్టీ సెల్ ఎస్.సర్దార్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ రాజేష్, విద్యార్థి విభాగం ఆర్.జోష్ కుమార్, పంచాయితీ రాజ్ విభాగం ఎస్.విజయ్‌కుమార్‌రాజు, ఆర్టీఐ విభాగం ఆర్.కిశోర్‌కుమార్‌రెడ్డి లను నియమించారు. వలంటీర్స్ విభాగం ఎ.ఇమ్రాన్, చేనేత విభాగం గంగాధర్, వాణిజ్య విభాగం ఎస్.మహబూబ్‌బాష, వైఎస్సార్‌టీయూసీ కె.వెంకటరమణ, అంగన్వాడీ విభాగం కె.రత్నమ్మ, సాంస్కృతిక విభాగం వి.లీలావతి, సోషల్ మీడియా విభాగం రమణప్ప, దివ్యాంగుల విభాగం డి.రమేష్, ప్రచారం విభాగం అధ్యక్షుడిగా సి.మంజునాథ్‌లను నియమించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ప్రసాదం స్వీకరిస్తున్న నిసార్ అహ్మద్



సీతారాముల కల్యాణోత్సవం

మదనపల్లె సిటీ: మండలంలోని దుబ్బిగాని పల్లె, పెంచపాడు పంచాయతీలలో సీతారాముల విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమాలలో మదనపల్లె వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పాల్గొన్నారు. పెంచపాడు పంచాయతీ శివారుపల్లె, దుబ్బి గాని పల్లి పంచాయతీ రెడ్డివారిపల్లె గ్రామాలలో ఇటీవల శ్రీరాముని నూతన ఆలయాల నిర్మాణ పనులు పూర్తి చేశారు. శుక్రవారం సంబంధిత ఆలయాలలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి నిసార్ అహ్మద్‌ను స్థానిక నాయకులు ఆహ్వానించడంతో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలలో సర్పంచ్ బుడ్డన్న, డైరీ డే చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, శీన,బోడెప్ప, మహేష్, మల్లికార్జున, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. సీతారాముల కళ్యాణం

పెద్దమండ్యం: మండలంలోని కోటకాడపల్లె పంచాయతీ బండకాడపల్లెలో శుక్రవారం సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో సీతారామలక్ష్మణ హనుమత్సమేత స్వాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. శుక్రవారం ఉదయం స్వాముల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించి దేవాలయం వద్ద కళ్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవానికి కలిచెర్ల సింగిల్ విండో మాజీ చైర్మన్ కడప సుధాహరరెడ్డి హాజరయ్యారు. భక్తులకు, ప్రజలకు గ్రామానికి చెందిన ఎన్ రామిరెడ్డి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, మండల కన్వీనర్ పెద్దరెడ్డెప్పరెడ్డి, వేదపండితులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే భవిష్యత్తుకు పునాది



విశ్వం కళాశాల వేడుకల్లో సినీ కళాకారులతో ప్రభాకర్ రెడ్డి

కురబలకోట: తరగతి గదిలోనే భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుందని విశ్వం విద్యా సంస్థల అధినేత విశ్వం ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఆడియోస్-2కె25 ఫేర్‌వెల్‌డే ఫంక్షన్‌లో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాదికల్లా సరికొత్త విశ్వం ఇంజినీరింగ్ కళాశాలను చూస్తారన్నారు. కళాశాలలో ఏసీ ఆడిటోరియం ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా సభలు, సమావేశాలు, వర్క్‌షాపులు, సదస్సులు తదితర వాటికి ఎంతో అనువుగా ఉంటుందన్నారు. అలాగే కళాశాలలో దశల వారిగా అత్యాధునిక ల్యాబ్‌లను తీసుకు వస్తామన్నారు. ఆర్టిఫిషియల్ (ఏఐ) ఇంటిలిజెన్స్ టెక్నాలజీతో కంపెనీల, సంస్థల పనులను అనుసంధానం చేయగలిగిన నిపుణుల కోసం ప్రపంచం ఎదురు చూస్తోందన్నారు. ఇలాంటి వారికి ఇప్పుడు అత్యధిక డిమాండు ఉంటోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి, ఏఓ బి.ఈశ్వరయ్య, పూజారి అంజి తదితరులు పాల్గొన్నారు. సినీ గాయకురాలు లాస్యప్రియా, సంపత్, శిరిష, మ్యూజిషియన్, మెంటరిస్టు రామ్ అఖిల్ ముఖ్య అతిధులుగా హాజరై కళా నైపుణ్యంతో అలరించారు.

జేఎన్టీయూ కళాశాలను యూనివర్సిటీ చేయడానికి కృషి



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్ తదితరులు

కలికిరి: కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీగా మార్చు చేయడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కళాశాల క్రీడా, వార్షికోత్సవ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కలికిరిని విద్యా హబ్‌గా తీర్చిదిద్దడానికి తమ కుటుంబం కృషి చేసిందని, కళాశాలను యూనివర్సిటీగా మార్చడానికి అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించి ప్రతిభ చాటాలని కోరారు. అనంతరం క్రీడలలో ప్రతిభ చాటిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు చంద్రశేఖర్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజు, పీఈటీ సునీత, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలని ధర్నా



కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి

మదనపల్లె సిటీ: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇన్సూరెన్సు చెల్లించి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ఇన్సూరెన్సు చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మిక కుటుంబాలకు అన్యాయం జరుగుతోందన్నారు. కార్మికులకు పనిముట్లు కావాలని 2022 ఫిబ్రవరిలో ధర్నా చేశామని, ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న నూనె, సోపులు, పాదరక్షలు ఇవ్వాలన్నారు. 17 క్లాప్ వెహికల్స్ లేకపోవడం వల్ల పారిశుద్ధ్య పనులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల ఈనెల 15వతేదీ లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను తాత్కాలికంగా విరమించుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు ముబారక్, తిరుమలప్ప, దేవేంద్ర, వాసు, పృథ్వీరాజ్, వంశి, శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.